# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 01-06-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ దివ్యాంగులు, 60 సంవత్సరాలు పైబడిన వారికి ఇంటివద్దకే రేషన్ అందిస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.
- ❖ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలలో ప్రజలను భాగస్వాములను చేయాలని అధికారులకు విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సూచించారు.
- ❖ మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం అందరి బాధ్యతని ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పిలుపునిచ్చారు.
- ❖ పంటల సాగులో ఆధునిక విజ్ఞానాన్ని వినియోగించి మెరుగైన దిగుబడులు సాధించాలని జాతీయ వాణిజ్య పంటల పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్ అన్నారు.

========================

రాష్ట్ర వ్యాప్తంగా పౌరసరఫరాల దుకాణాల ద్వారా సరకుల పంపిణీ కార్యక్రమం ఈరోజు ప్రారంభమైంది. కాకినాడ జిల్లా పిఠాపురంలో రేషన్ పంపిణీ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. అనంతరం పాత్రికేయులతో మంత్రి మాట్లాడుతూ... ఉదయం 8 నుంచి 12 గంటల వరకు సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు కార్డుదారులకు రేషన్ అందించడం జరుగుతుందని తెలిపారు. 60 సంవత్సరాలు పైబడిన వారికి దివ్యాంగులకు రేషన్ ఇంటివద్ద అందిస్తామని మంత్రి తెలిపారు. తొలిసారిగా రాష్ట్రంలో 15 లక్షల 60 వేల మందికి ఇంటి వద్దకే రేషన్ పంపించడానికి ఏర్పాటు చేశామని చెప్పారు. పోర్టబిలిటీ సదుపాయాన్ని రాష్ట్రంలో కల్పిస్తున్నామని, కార్డుదారులు ఎక్కడైనా సరకులు పొందవచ్చునని అన్నారు. నూతనంగా అభివృద్ధి చేసిన ప్రత్యేక యాప్ సహాయంతో ఎప్పటికప్పుడు పంపిణీ సరళిని పర్యవేక్షిస్తామని, రేషన్ కేంద్రాల వద్ద సీసీ కామెరాలు ఏర్పాటు, మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. రేషన్ కార్డ్ లపై వచ్చిన దరఖాస్తులను 21 రోజుల్లో పరిష్కరించి మంజూరు, మార్పులు, చేర్పులు చేస్తామని చెప్పారు. ప్రతి కుటుంబానికి పారదర్శకంగా సరకులు పంపిణీ అందిస్తామని మంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

=======================

మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం అందరి బాధ్యతని ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. "నషాముక్త్ భారత్ అభియాన్", అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా అవగాహన కల్పిస్తూ... ఏలూరులో నిర్వహించిన 5కె వాక్ థాన్ ను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ, పోలీస్, ఎక్సైజ్, ఈగిల్ బృందం, వైద్య ఆరోగ్యశాఖ సంయుక్తంగా నిర్వహించిన వాక్ థాన్ లో సుమారు 600 మందికి పైగా వివిధ శాఖల అధికారులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా నిర్మూలన కోసం కేంద్ర ప్రభుత్వం "నషాముక్త్ భారత్ అభియాన్" ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలు రాష్ట్ర టోల్ ఫ్రీ నెంబరు 1972 కి, నేషనల్ టోల్ ఫ్రీనెంబరు 14446 కు అందించాలని కోరారు.

అలాగే కృష్ణా జిల్లా మచిలీపట్నంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్డీవో వాణి పాల్గొని మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలను ప్రజలకు వివరించారు. యువత వీటికి దూరంగా ఉండాలని సూచించారు.

=======================

పంటల సాగులో ఆధునిక విజ్ఞానాన్ని వినియోగించి మెరుగైన దిగుబడులు సాధించాలని జాతీయ వాణిజ్య పంటల పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్ సూచించారు. వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ లో భాగంగా ఈరోజు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పేరవరం, తాడిపూడి, ర్యాలి గ్రామాల్లో రైతులతో సదస్సులను నిర్వహించారు. కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రైతులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పలు పథకాలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రైతుల సందేహాలును డాక్టర్ రాజశేఖర్ నివృత్తి చేశారు. రైతులకు ఆదునిక పరిజ్ఞానాన్ని చేరువచేయటంతో పాటు, ప్రభుత్వం రైతులుకు అందిస్తున్న వివిధ పథకాలను వివరిస్తూ... ఖరీఫ్ సాగుకు సన్నద్ధం చేసే దిశంగా ఈ సదస్సులు నిర్వహించారు.

విరామం

=======================

అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలలో విశాఖ జిల్లా ప్రజలను భాగస్వాములను చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. యోగాంధ్ర వేడుకలలో భాగంగా ఈ రోజు ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం తొట్లకొండపై జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో సుమారు 1000 మందితో యోగాసనాల కార్యక్రమం నిర్వహించారు. బౌద్ధ గురువుల ప్రార్ధనలతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ఈనెల 21వ తేదీన విశాఖ వేదికగా జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా ఆర్కే బీచ్ నుండి భీమిలి వరకు యోగాసనాలు వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.. ఈ కార్యక్రమంలో సుమారు 5 లక్షల మంది ప్రజలను భాగస్వాములను చేసేదిశగా కృషి చేస్తున్నామన్నారు.

=======================

పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గంలో చౌక ధరల దుకాణంలో లబ్దిదారులకు సరకుల పంపిణీని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ... ప్రజల అవసరాలను తెలుసుకుని వారి కోసం పని చేయడం జరుగుతోందని చెప్పారు. ఈ విధానాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని ఆయన సూచిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

=======================

రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ కానిస్టేబుల్ మెయిన్స్ రాత పరీక్ష ఈరోజు ప్రశాంతంగా జరిగింది. పరీక్షా కేంద్రాల వద్ద పూర్తి స్థాయిలో అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 10 గంటల నుండి ఒంటి గంట వరకూ ఈ పరీక్ష జరిగింది. ఉదయం 9 గంటల

నుంచే పరీక్షా కేంద్రాల్లోనికి అభ్యర్థులను అనుమతించారు. ఈ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, డ్రోన్లతో పర్యవేక్షణ చేశారు. కాగా విశాఖపట్నం పరిధిలో 27 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్ష ప్రశాంతంగా ముగింది.

========================

రాష్ట్రంలో స్వయం సహాయక బృందాల్లోని మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరులో ఆయన ఈరోజు పొదుపు సంఘాల మహిళలతో జరిగిన సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... మహిళలను వ్యాపారవేత్తలుగా నిలిపేందుకు నెల్లూరులో 200 దుకాణాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. దుకాణం నిర్వహణ కోసం ఒక్కో మహిళకు బ్యాంకు ద్వారా 2 లక్షల రూపాయల వరకు రుణాన్ని మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు.

========================

“యోగాంధ్ర” కార్యక్రమాలలో భాగంగా తూర్పుగోదావరి జిల్లాలోని పర్యాటక ప్రదేశాల్లో తొలి జిల్లా స్థాయి కార్యక్రమం ఈ రోజు నిర్వహించారు. స్థానిక సరస్వతి ఘాట్ లో పర్యటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ పి ప్రశాంతి, సంయుక్త కలెక్టర్, నోడల్ అధికారి ఎస్ చిన్న రాముడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల్లో యోగా సాధనపై ఆసక్తి కలిగించడం, యోగ సాధన వల్ల కలిగే ప్రయోజనాలు విస్తృత స్థాయిలో వివరించడం జరుగుతోందని తెలిపారు. జూన్ 20వ తేదీ వరకు కార్యక్రమ ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నామని చెప్పారు.

========================

గిరిజన ప్రాంతాలలో జ్వర లక్షణాలు కలిగిన వారిని గుర్తించడానికి ఇంటింటి సర్వే చేస్తున్నామని అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మండలం అదనపు వైద్య శాఖ అధికారిణి జి.శిరీష పేర్కొన్నారు. ఈ రోజు మండలంలోని పెద్ద గద్దెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఫీవర్ సర్వేలు చేశామని తెలిపారు. వర్షాలు కారణంగా డెంగు, మలేరియా ప్రబలకుండా ప్రతి ఇంటిలో దోమతెరలు ఏర్పాటు చేసుకోవాలని.. ఇంటి ఆవరణలో నీటి నిల్వ లేకుండా చూడాలని ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలియజేశారు.

========================
========================